తాడిపత్రిలో కేంద్ర సాయుధ బలగాల పహారా

తాడిపత్రిలో భద్రత కట్టుదిట్టం

ప్రజాశక్తి తాడిపత్రి

సార్వత్రిక ఎన్నికల చివరి దశ అనంతరం వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్, నాలుగవ తేదీ ఎన్నికల లెక్కింపు సందర్భంగా తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇరువురి నాయకుల ఇళ్ల వద్ద ముళ్లకంచెలు ఏర్పాటు చేసి అభిమానులు కార్యకర్తలు గుమి కూడకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పట్టణంలో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు చేస్తూ డీఐజీ తాడిపత్రిలో మకాం వేసి శాంతి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. తాడిపత్రిలో పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణ నేపథ్యంలో తాడిపత్రిలో భారీగా పోలీసులను మోహరించి శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చారు. తాజాగా జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా తాడిపత్రి పట్టణంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి నివాసాల వద్ద పోలీసులు ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తాడిపత్రికి భారీగా కేంద్ర సాయుధ బలగాలు, ఏపీఎస్పీ బలగాలు చేరుకున్నాయి. జూన్ 6వ తేదీ వరకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డిని తాడిపత్రిలోకి వెళ్లవద్దని ఆంక్షలు ఉన్నందున పోలీసులు తాడిపత్రి చుట్టుపక్కల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పట్టణంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల కేసులో నిందితుల అరెస్టులు కొనసాగుతున్నాయి. వాటికి సంబంధించి ఏడు కేసులు నమోదు కాగా ఇప్పటికే 134 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ హైదరాబాదులో ఒక నాయకునికి సంబంధించిన అనుచరులను 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో డిఐజి ఆదేశాల మేరకు డిఎస్‌పి జనార్ధన నాయుడు ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తు అల్లర్లు, గొడవల కు దిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా పార్టీల కార్యకర్తలకు, ఇరు కుటుంబాల అభిమానులకు హెచ్చరిక చేస్తూ శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగదని పట్టణ ప్రజలకు భరోసానిస్తున్నారు. పట్టణంలో ప్రస్తుతం సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం చట్ట విరుద్ధమని 144 సెక్షన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

నాయకుల ఇళ్ల ముందు వేసిన ఇనుప ముళ్లకంచె

ఎగ్జిట్‌పోల్స్ ఉత్కంఠ

◆సర్వత్రా అదే చర్చ ◆బెట్టింగ్‌రాయుళ్లలో టెన్షన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎక్కడ చూసినా అదే చర్చ. ఎగ్జిట్ పోల్స్ ఏ రకంగా ఉండనున్నాయన్నదే. ఎవరికి అనుకూలంగా ఉండనున్నాయి..ఎవరికి ప్రతికూలంగా ఉండనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి అనేక ఊహగానాలు సాగుతున్నాయి.. ఎగ్జిట్‌పోల్స్ అనే సరికి ఫలితాల ముందు వచ్చే సెమీఫైనల్‌లాగా భావిస్తున్నారు. ప్రధానంగా ఓట్ల ఫలితాలపై అభ్యర్థుల కంటే బెట్టింగులు కాసే వారిలో ఉత్కంఠ ఎక్కువగా కనిపిస్తోంది. శనివారం సాయంత్రం ఎగ్జిట్‌ఫోల్స్ వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఏ ఎగ్జిట్‌పోల్స్ ఏ రకంగా ఉండనున్నాయన్న చర్చ నడుస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ తమకు అనుకూలంగా ఉండనున్నాయని అధికార వైసిపి భావిస్తుండగా, లేదు తమకు అనుకూలమని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు చెబుతున్నారు. జిల్లాలోనూ దీనిపై అనేక చర్చలు నడుస్తున్నాయి. మెజార్టీ స్థానాలు వైసిపి కైవసం చేసుకుంటుందని ఆపార్టీ నాయకులు చెబుతున్నారు. కాదు తామే ఎక్కువ సీట్లు గెలుస్తామని టిడిపి నాయకులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో ఏ స్థానంలో ఎవరు గెలుపొందే అవకాశముందన్న అంచనాలు ఇది వరకే ఉన్నాయి. అయితే ఎగ్జిట్ ఫోల్ ఫలితాలు మరింతగా రూఢీ చేయనున్నాయన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. గతంలోనూ 2019లో ఇదే రకంగా బెట్టింగులు జరిగాయి. అప్పుడు కొంత మంది లాభపడగా, మరికొంత మంది నిండామునిగి ఉన్న డబ్బులు పోగొట్టుకున్నారు. ఈసారి గెలుపుపై ఏ పార్టీలోనూ ధీమా వ్యక్తం చేసే పరిస్థితుల్లేవు. ఎందుకంటే అటు కూటమి, ఇటు వైసిపి ఒంటరి కావడంతో ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్న సందిగ్ధత ఇప్పటికీ ఉంది. ఈ నేపథ్యంలో అందరి ముందస్తు ఆశలు ఎగ్జిట్‌పోల్స్‌పైనే ఉన్నాయి. దాన్ని బట్టి జూన్ నాలుగున ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్న ఒక ప్రాథమిక అంచనాకు వచ్చే అవకాశాలుండనున్నాయి.

బెట్టింగురాయుళ్లలో మరింత ఉత్కంఠ

ఎగ్జిట్‌పోల్స్‌పై అభ్యర్థుల కంటే బెట్టింగురాయుళ్లలో ఎక్కువ ఉత్కంఠ నెలకొంది. ఎందుకంటే ఎన్నికలు పూర్తయినప్పటి నుంచే బెట్టింగులు పెద్దఎత్తున మొదలయ్యాయి. ఒకటికి రెండు అని, ఒకటికి ఐదు అని ఇలా రకరకాలుగా బెట్టింగులు నడిచాయి. ఈ బెట్టింగు డబ్బులు పెట్టుకోవడం కోసమే ప్రత్యేకమైన కార్యాలయాలు కూడా ప్రారంభమయ్యాయన్న ప్రచారమూ నడుస్తోంది. మొత్తానికి కోట్లాలోనే బెట్టింగులు ఇప్పటికే నడిచాయి. ఈ బెట్టింగురాయుళ్లలో ఈ ఎగ్జిట్‌పోల్స్ మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. తాము పందేం కాసిన పార్టీ లేదా అభ్యర్థికి అనుకూలంగా వస్తే ఫలితాల వరకు ఉత్సాహం నెలకొంటుంది. వ్యతిరేకంగా ఉంటే మాత్రం మంగళవారం వరకు బిక్కుబిక్కుమనే పరిస్థితులు ఉండనున్నాయి. ఏది ఏమైనా శనివారం సాయంత్రానికి ఎగ్జిట్‌పోల్స్ రానున్నాయి. ఆ తరువాత మంగళవారం రోజు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ పోల్స్ తరువాత బెట్టింగు జోరు మరింత పెరిగే అవకాశాలూ లేకపోలేదన్న చర్చ నడుస్తోంది.

పొగాకు వాడకం ప్రాణాంతకం

ప్రజాశక్తి-హిందూపురం

పొగాకు వాడడం ద్వారా మరణానికి దగ్గరైనట్టేనని హిందూపురం జిల్లా అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ తో పాటు ఆస్పత్రి దంతవైద్య నిపుణులు డాక్టర్ భూపాలం విజయ్ బాబు, డాక్టర్ అయిషా మాట్లాడుతూ పొగాకు వాడడం గుండె, జీర్ణప్రక్రియ. మానసిక ఆరోగ్యం. వ్యాధినిరోధక వ్యవస్థలపై ప్రభావం చూపుతుందని అన్నారు. అనంతరం పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు డాక్టర్ రాజగోపాల్, సైక్రియాటిక్ కౌన్సిలర్ రాణి, సిఒలు ముస్తఫా, రమేష్, లోకేష్, రవి, తనూజా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని లేపాక్షి రోడ్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ రవి శంకర్ మాట్లాడుతు ఎండల తీవ్రత నుంచి ప్రజలను ఉపశమనం కోసం పట్టణంలో వివిధ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి 40 రోజులుగా తాగునీటిని అందించామన్నారు. చివరిరోజైన శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు, అనూష, అఖిల్ కుమార్, రాజు, బసప్ప, లక్ష్మి వెంకటేష్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి అన్నారు. హిందూపురం రూరల్ మండలం, పట్టణంలోని మధ్యాహ్న భోజన పథకం వంట మనుషులకు, సహాయకులకు శుక్రవారం స్థానిక చిన్మయ పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతు విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం వంటల పోటీ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒకార్యాలయ సిబ్బంది తౌసిఫ్ ఖాన్, ప్రవీణ్ కుమార్, సురేష్ బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు టీవీ వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ కు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద్ టీవీ వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం రూ. 27 వేలు విలువగల స్మార్ట్ టీవీని బహుమానంగా అందించారు. ఇటీవల కాలంలో రమానంద్ హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు ఉన్న నేపథ్యంలో విలేకరులందరూ ప్రెస్ క్లబ్ లో ఫలితాలు వీక్షించడానికి స్మార్ట్ టీవీ కావాలని రమానంద్‌ను కోరగా ఆయన వెంటనే స్పందించి ప్రెస్ క్లబ్ కు స్మార్ట్ టీవీని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

ప్రజాశక్తి-హిందూపురం


సంపత్ కుమార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

దారుణ హత్యకు గురైన న్యాయవాది సంపత్ కుమార్ మృతికి స్థానిక బార్ అసోసియేషన్ తన సంతాపాన్ని వ్యక్తం చేసింది. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో సంపత్ కుమార్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతు పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా కేసును విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా సంపత్ కుమార్ కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు రఘునాథ్ రెడ్డి, సత్యనారాయణ, వన్నూరప్ప, సుదర్శన్, సిద్ధు, శ్రీరాములు, నాగేంద్ర, గుండాచారి, మురళి, సుధాకర్, రమేష్, ప్రసాద్ రెడ్డి, సదాశివరెడ్డి కళావతి, నవేరా, సంతోష్ కుమారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పిందే ధర.. ఇచ్చిందే మందు..!

చెలరేగిపోతున్న మెడికల్ మాఫియా
జనరిక్ మందులు బ్రాండెడ్ తరహాలో విక్రయం
పట్టించుకోని తనిఖీ అధికారి

మెడికల్ షాపు నిర్వాహకులు చెప్పిందే ధర, ఇచ్చిందే మందు. రోగులు ధరలను అడగరు.మందు ఏది ఇచ్చారు అని అడగరు. కొనుగోలు చేసిన మందులకు బిల్లులు అడగరు. తక్కువ ధరలో లభిస్తున్న జనరిక్ మందులను మెడికల్ షాపుల వారు వాటికి మూడు రెట్లు అదనంగా విక్రయిస్తు ప్రజలను అందినకాడికి దోచుకుంటున్నారు. సాధారణంగా మందులపై ఉండే గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి)ని చూయించి రూ.30 ఉండే మందును రూ.125కి అమ్మకాలు సాగిస్తున్నారు. అతి చౌకగా లభించే జనరిక్ మందులను కూడా బ్రాండెడ్ కంపెనీల మందుల తరహాలో ఎంఆర్‌పి ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. మందులను ఎన్ఆర్‌పి కంటే ఎక్కువ ధరకు అమ్మకూడదన్న నిబంధనలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ విక్రయాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

కోవిడ్ అనంతరం ఎక్కువమంది అనారోగ్యాల కారణంగా అధికంగా మందులు వాడాల్సి వస్తోంది. ప్రతి ఇంట్లో ఒక్కరైనా నిత్యం మందులు వాడాల్సిన పరిస్థితి. కాస్త అవగాహన ఉన్నవారు తక్కువ ధరలో లభ్యమయ్యే మందులను కొనుగోలు పట్ల ఆసక్తి చూపుతున్నారు. మందుల పట్ల అవగాహన లేని వారు మెడికల్ షాపులో కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మెడికల్ షాపులు తక్కువ ధరకు జనరిక్ మందులు తెచ్చి వాటినే బ్రాండెడ్ మందుల తరహాలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఉదాహరణకు సిప్లా కంపెనీకి చెందిన పాంటాప్ డిఎస్ఆర్ క్యాప్యూల్స్‌ను గ్యాస్ సమస్య ఉన్న వారు రోజు వారీగా పరగడుపున వాడతారు. ఇవి జనరిక్ మెడికల్ షాపుల్లో లభిస్తున్నాయి. 10 క్యాప్యూల్స్ జనరిక్ మెడికల్ షాపులో రూ. 46కే అమ్ముతున్నారు. అవే మాత్రల స్ట్రిప్ ఎంఆర్‌పి ధర రూ.125 ఉంటుంది. దీన్ని ఒక్కొక్క మెడికల్ షాపులో ఒక్కో రేటుపై రూ. 100 లేదా రూ.88కు అమ్ముతున్నారు. కొనుగోలుదారులు దానిపై ఉన్న ఎమ్ఆర్‌పి ధర చూసి తక్కువకే ఇచ్చినట్లు భావిస్తున్నారు. అయితే అసలు ధర కన్నా మూడు రెట్లు అదనంగా ధర నిర్ణయించి అమ్మకాలు జరుపుతున్నారు. జనరిక్ మందులు వచ్చి 20 ఏళ్లు అవుతున్నా అత్యధికులకు ఈ మందుల గురించి తగిన అవగాహన లేదు. పట్టణాల్లో కొన్ని ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ షాపులు ఉన్నా ప్రజలకు వీటి గురించి తెలియదు. పట్టణాల్లో ఉన్న పెద్ద షాపుల వారు కూడా జనరిక్ మందులను ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు.

జనరిక్ మందు అంటే..

ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు అనేక పరిశోధనలు, పరీక్షలు చేసి మందును మార్కెట్లోకి తెస్తాయి. అందుకు ప్రతిఫలంగా ఆ మందు తయారీపై ఆ కంపెనీకి కొంత కాలం పాటు (20సంవత్సరాల వరకు) పేటెంట్ హక్కులు ఉంటాయి. అలా తయారు చేసిన మందులను బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అంటారు. ఆ మందు తయారీ ఫార్ములా తెలిసినా ఏ ఫార్మా కంపెనీ అయినా సరే, దానిని పేటెంట్ ఉన్న కాలంలో పెటెంట్ పొందిన కంపెనీ అనుమతి లేకుండా ఆ మందు తయారు చేయకూడదు. అలా పేటెంట్ లో ఉన్న మందులను ఇతరులు ఎవరైనా తయారు చేసి అమ్మరాదు. అందువల్ల 20 సంవత్సరాల పాటు ఆ మందుపై దానిని తయారు చేసిన కంపెనీకి పేటెంట్ హక్కులు కల్పించి పెట్టుబడి సొమ్మును రాబట్టుకోడానికి ఆ మందును మొట్టమొదట తయారు చేసిన కంపెనీకి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. ఏదైనా ఒక మందు మొట్టమొదటి తయారు చేసిన కంపెనీ పేటెంట్ కాలం ముగిసిన తర్వాత అదే ఫార్ములాతో అదే మందును ఏ కంపెనీ అయినా తయారు చేసి మార్కెట్ లోకి విడుదల చేయొచ్చు. అలా తయారు చేసిన మందులను జనరిక్ మందులు అంటారు. జనరిక్ మందు తయారు చేయటానికి ఫార్మా కంపెనీలు ఎటువంటి పరిశోధనలు గానీ, క్లినికల్ ట్రయల్స్ గానీ జరపవలసిన అవసరం ఉండదు. అందువల్ల జనరిక్ మందుల ధరలు బ్రాండెడ్ మందుల ధరలతో పోలిస్తే 30 నుంచి 80 శాతం తక్కువ ధరలలో లభిస్తాయి. వీటిపై ముద్రించి ఉండే ఎన్ఆర్‌పి కంటే చాలా తక్కువ ధరకే లభిస్తాయి. వాటి ధర వాస్తవానికి చాలా తక్కువగా ఉన్నప్పటికీ వాటి మీద మీద ముద్రించబడిన ధర చాలా ఎక్కువగా ఉంటుంది. దీన్ని మెడికల్ షాపుల వారు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. కొనుగోలుదారు అడిగితే కొంచెం ధర తగ్గిస్తున్నారు.

డ్రగ్ ఇన్స్‌పెక్టర్ లేక ఖాళీగా ఉన్న గది

దాడులు చేపట్టని డ్రగ్ ఇన్స్‌పెక్టర్

ఉమ్మడి జిల్లాలోనే అనంతపురం తర్వాత అతి పెద్ద పెద్ద పట్టణం హిందూపురం. శ్రీ సత్య సాయి జిల్లాలో ఎక్కువ అసుపత్రులు ఉన్నాయి. దీంతో పాటు హిందూపురం పట్టణంలోని సుమారు 100కు పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. హిందూపురంలో కార్యాలయం ఉండే డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పరిధిలోకి మడకశిర, పెనుకొండ, గోరంట్ల, కదిరి తదితర పట్టణాలు వస్తాయి. అయితే అధికారి మాత్రం లేరు. ఉన్నా తనఖీలు చేయరు. చర్యలు చేపట్టరు. దీంతో కనీస విద్యార్హత లేని వారు సైతం బినామి పేర్లతో మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుని మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. దీనిపై డ్రగ్ ఇన్స్‌పెక్టర్ల బృందం ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తే పెద్ద కుంభ కోణం బయటపడుతుంది. అయితే ఔషధ నియంత్రణ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో మెడికల్ షాపు నిర్వహకులు ధరల మాయాజాలం చేసి ప్రజల నుంచి అడ్డంగా దోచుకుంటున్నారు. అధికారులు స్పందించి మెడికల్ షాపుల్లో దోపిడీని అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

పట్టణంలోని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం

పొగాకు వాడకంతో మానవ మనుగడకు ముప్పు

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో వైద్యాధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పుట్టపర్తి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సిలో పొగాకు వ్యతిరేకతపై జిల్లా ఎన్‌సిడిసిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, డిపిఎంఒ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో అత్యధిక మంది పొగాకు ఉత్పత్తులు(సిగరెట్, బీడీ, తంబాకు, గుట్కా)కు బానిసలయ్యారన్నారు. వారిలో ఎక్కువగా వ్యవసాయ, వలస కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, అధిక ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగులు ఉండడం బాధాకరమన్నారు. పొగాకు వాడకం వల్ల నోరు, ఊపిరితిత్తుల, కాలేయ క్యాన్సర్, క్షయ, గుండెజబ్బుల బారిన పడతారన్నారు. కావున హెల్త్ ప్రొవైడర్స్ ఈ రోజు నుంచి పొగాకు ఉత్పత్తులకు బానిసైన వారిని దత్తత తీసుకొని పొగాకు వాడకాన్ని మాన్పించాలన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక,డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ ఎం.త్రిలోకనాథ్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడుతున్న వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వాటికి దూరం చేయాలన్నారు. పొగాకు ఉత్పత్తులను బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించినా, ప్రభుత్వ కార్యాలయాలకు 300 అడుగుల దూరంలో వాడినా, లైసెన్స్ లేకుండా ఉత్పత్తి చేసినా, అమ్మినా జరిమానా, జైలు శిక్ష తప్పదని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని ఆపాలనుకున్న వారి కోసం ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో టిసిసి సెంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం మనవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమాలజిస్ట్ బాలాజీ, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్ఎం లలితకుమారి, సుపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక పిహెచ్‌సిలో మండల వైద్యులు హరికుమార్, ఓంకార్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యం చెడిపోతుందన్నారు. పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తి తద్వారా వైద్య ఖర్చులు పెరిగి కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతాయన్నారు. కావున కుటుంబంలో ఎవరూ పొగాకు ఉత్పత్తులను వినియోగించ రాదని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మనోహర్‌రెడ్డి, పిహెచ్‌ఎన్ సుబ్బమ్మ, సూపర్వైజర్ రవీంద్ర, ఎఎన్ఎంలు సరస్వతి, రాజకళ, ఆశా కార్యకర్తలు అశ్విని, నిరోష, భారతి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ఆరోగ్యవంతమైన అలవాట్లతో పొగాకు రహిత సమాజ నిర్మాణానికి అన్ని వర్గాల వారు కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక

పుట్టపర్తి పిహెచ్‌సిలో మాట్లాడుతున్న వైద్యులు

దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లా డారు. క్యాన్సర్ వ్యాధి కారకాల్లో పొగ తాగడం అతి ముఖ్యమైందన్నారు. దీని వల్ల అన్ని వయస్సుల వారికి ఆయు ప్రమాణం అతివేగంగా తగ్గిపోతోందన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్, పక్షవాతం, అంగవైకల్యం, తదితర దుష్పరిణామాలు కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నివారణ కు వైద్యుల సలహాలు, సూచనలతో పాటు ఆరోగ్య అలవాట్లు పాటించాలని సూచించారు. చివరగా పొగాకు ఉత్పత్తుల వినియోగం నుంచి పర్యావరణాన్ని రక్షించుటకై ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో డాక్టర్ కమల్ రోహిత్, సిబ్బంది సుభాషిని, దిల్షాద్, విజయకుమారి, వరలక్ష్మి, సరిత, హెప్సిబా, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే 'సజ్జల' రెచ్చగొట్టే వ్యాఖ్యలు : కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో మరో నాలుగు రోజుల్లో ఫలితాలు రానున్నాయని, ఈ నేపథ్యంలో వైసిపి ఓటమి భయంతోనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం లో శుక్రవారం కందికుంట మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ కూటమి అధికా రంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సజ్జల చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం, ప్రజాస్వామ్య వాదులు అసహించుకొనేలా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రావడం ఖాయమని తెలుసుకున్న సజ్జల ఆ విషయాన్ని జీర్ణించుకోలేక టిడిపి కూటమి శ్రేణులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిబంధనలను పాటించని పార్టీ వైసిపి అయితే సిద్ధాంతాలు, క్రమశిక్షణకు మారుపేరు టిడిపి అన్నారు. చట్టబద్ధంగా వెళ్దాం, చట్టాన్ని గౌరవిం చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించినా సంయమనం పాటిం చాలని టిడిపి శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో గెలవబోతున్నాం.. ప్రభుత్వంలో భాగస్వాములు కాబోతు న్నాం.. ఈ విజయాన్ని ప్రజలు, ఈ ప్రాంత అభివద్ధి కోసం వినియోగించుకునే విధంగా ఆలోచన చేద్దామని తెలుగుతమ్ముళ్లకు పిలుపునిచ్చారు.

CHANGE OF NAME

I, KADIRI MOHAMMED KHALID S/o KADIRI AMEER SAHIB, R/o Door No. 9-88-3, NANADARGA STRET, KADIRI Town, Kadiri Mandal, Sri Satya Sai District, A.P. herewith declare that I am changed my name as KHADRI MOHAMMED KHALID S/O KHADRI AMEER SAHIB, as per my Aadhar Card No. 3622 3038 3276 and also as per my Educational Certificates. Please concern my name as **KHADRI MOHAMMED KHALID S/o KHADRI AMEER SAHIB** (New Name) from KADIRI MOHAMMED KHALID S/O KADIRI AMEER SAHIB (Old Name). Henceforth, I am being called as **"KHADRI MOHAMMED KHALID S/O KHADRI AMEER SAHIB"** for all purposes.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ ఆదేశించారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కొత్త చెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఎఆర్ కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో మార్చ్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంతటి వారైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏ పార్టీ గెలిచినా ప్రజలు సంయమనం పాటించాలన్నారు. 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నందున రోడ్లపై గుంపులుగా ఉండకూడదన్నారు. ఘర్షణలకు పాల్పడితే లాఠీఛార్జ్‌తో పాటు కాల్పులకు వెనుకాడబోమన్నారు. గ్రామాల్లో పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ప్రశాంతంగా ఉండాలన్నారు. బాణసంచా పేల్చడం, ఊరేగింపులు నిషేధమన్నారు. అతిక్రమిస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఆర్ రిజర్వుడ్ ఆర్ఐ చంద్రశేఖర్, సిఐలు రాజా రమేష్, రామయ్య, కొండారెడ్డి, రాజేంద్రయాదవ్, ఎస్ఐ సురేష్‌బాబు, ఎఎస్ఐలు రమణ, సుబాన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

రౌడీ షీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్

లేపాక్షి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు దృష్ట్యా సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడరాదని, బాణసంచా పేల్చరాదని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించినా చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ గోపి, ఎఎస్ఐ షర్ఫుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగించొద్దు : సిఐ

ముదిగుబ్బ : జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం ఎవరైనా ఎంతటి వారైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ యతీంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ మాట్లాడుతూ మండలంలో 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, ప్రజలు ఎవరూ గుంపులుగా ఉండరాదని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, బాణసంచా పేల్చరాదన్నారు. టపాసులు అక్రమంగా నిల్వ ఉంచి రహస్యంగా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. లౌడ్ స్పీకర్స్, డిజెలు పెట్టరాదన్నారు. డిజె బాక్సులు, లౌడ్ స్పీకర్స్ అద్దెకిస్తే వారిపై కూడా చర్యలుంటాయన్నారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే రౌడీ షీట్లు, జిల్లా బహిష్కరణ లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసుల పెట్రోలింగ్ నిరంతరం ఉంటుందన్నారు. జూన్ 3, 4, 5 తేదీల్లో ఎక్కడా మద్యం అమ్మకాలు విక్రయించరాదన్నారు. బైకులు, ఏ ఇతర వాహనాలకైనా సైలెన్సర్లు తీసి పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగేస్తే వాహనం సీజ్ చేసి నడిపే వ్యక్తిపై కేసు నమోదు చేస్తామన్నారు. మండలం మొత్తం డ్రోన్ కామెరాలతో ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, అల్లర్లు సృష్టించినా, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా డ్రోన్ కెమెరాల సాయంతో కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారను.

గ్రామాల్లో కలిసి మెలిసి జీవించాలి : ఎస్ఐ

బత్తలపల్లి : గ్రామాల్లోని ప్రజలందరూ ఒక్కటేనని, అందరూ కలిసి ఐక్యంగా జీవించాలని ఘర్షణలు, గొడవలకు తావు ఇవ్వద్దని ఎస్ఐ టివి.శ్రీనివాసులు సూచించారు. ఎస్సీ, ఎస్టీలు ఎవరి చేతిలోనైనా అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. బత్తలపల్లిలో శుక్రవారం ప్రజలకు ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించగా ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురై ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తారన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పెత్తందారులు వెట్టి చాకిరీ చేయించడం. దౌర్జన్యాలు చేస్తుంటే, బాల కార్మికులను వేధిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు ఎస్సీలు, ఎస్టీలను అడ్డం పెట్టుకుని ఎస్సీ యాక్టును దుర్వినియోగం చేస్తుంటారని, అలాంటి వారి మోసాలకు గురవ్వద్దని సూచించారు. పలువురు గ్రామంలో నెలకొన్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్ఐ తెలిపారు. సదస్సులో ఎఎస్ఐలు సోమశేఖరమూర్తి, తిరుపాలు, పోలీసులు పాల్గొన్నారు..

గొడవలు సష్టిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

పుట్టపర్తి : ఓట్ల లెక్కింపు, ఫలితాల అనంతరం గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లిలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. గ్రామంలో రికార్డులు లేని 12 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐతో పాటు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి, ఎఎస్ఐ రమణ, పోలీసులు ఉన్నారు.

జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

పుట్టపర్తి రూరల్ : జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పలు గ్రామాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్, తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా సోదాలు చేశారు. అలాగే సరైన రికార్డులు లేని వాహనాను గుర్తించి సీజ్ చేశారు. మద్యం, నాటుసారా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలపై సోదాలు చేశారు. అనుమానితులపై ఆరా తీసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టారు. కౌంటింగ్ అనంతరం ఎక్కడా ఎవరూ ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకూడదని పోలీసులు సూచించారు.

గాండ్లపెంట : మండలంలోని జీనులకుంట పంచాయతీకి చెందిన నాయనవారిపల్లి, వలసవాండ్లపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో అనుమానితుల ఇళ్లు, ప్రదేశాలు, దుకాణాలు, గడ్డివాముల్లో సోదాలు చేశారన్నారు. అలాగే ప్రజలు ఎలాంటి ఘర్షణలు, అల్లర్లకు పాల్పడకూడదని, బాణసంచా పేలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జమేదారు పి.రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది భాస్కర్, రాజు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఆర్‌డిటి సంస్థ ప్రోత్సాహంతో విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎడ్యుకేషన్ సెక్టార్ డైరెక్టర్ మోహన మురళీ సూచించారు. రీజియన్ పరిధిలో పదో తరగతిలో ఉన్నత మార్కులు సాధించడంతో పాటు సంస్థ నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో శుక్రవారం స్థానిక ఆర్‌డిటి ఫీల్డ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి మోహనమురళీ మాట్లాడుతూ రీజియన్ పరిధిలో 758 మంది పరీక్షలకు హాజరు కాగా 102 మందిని కుటుంబ ఆర్థిక సర్వే కోసం ఎంపిక చేశామని, సర్వే తరువాత 82 మందిని సంస్థ ఎంపిక చేసిందన్నారు. వీరిని విజయవాడ, అనంతపురం, తిరుపతి, కర్నూలు, తదితర ప్రదేశాల్లో కార్పొరేట్ విద్యాసంస్థల్లో సంస్థ ఖర్చులతో చదివిస్తుందన్నారు. ఇంటర్‌లో కూడా మంచి ప్రతిభ కనబరిస్తే ఉన్నత చదువులకు సాయం చేస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివిన వారు భవిష్యత్తులో ఇతరులకు సాయమందించాలన్నారు. రీజినల్ డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 30 ఏళ్ల క్రితం పాదర్ ఫెర్రర్ ప్రారంభించారని, ఇప్పుడు 21వ సంవత్సరంలో బత్తలపల్లి రీజియన్‌లో (పది మండలాలకు చెందిన) 62 మంది విద్యార్థులు ఉండడం సంతోషకరమన్నారు. ఉన్నత చదువులకు ఎంపికైన విద్యార్థులకు జూన్ 8వ తేదీ అనంతపురం ఆర్‌డిటి ఆఫీస్‌లో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎటిఎల్ రుక్మాంగధ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డి ప్రమీల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-బత్తలపల్లి

భవిష్యత్తు తరాల వారికి ప్లాస్టిక్ రహిత సమాజం అందించడానికి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కిషోర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. జూన్ 5వ తేదీ అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం పురష్కరించుకుని ఎపి కాలుష్య నియంత్రణ మండలి, అనంతపురం రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ బత్తలపల్లి సహకారంతో ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ నుంచి ఆర్‌డిటి ఆసుపత్రి మీదుగా ఆడిటోరియం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆడిటోరియంలో పర్యావరణంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వినాశనంతో రాబోయే రోజుల్లో మానవుని మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కళాకారులు పాటల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు శర్మ, ప్రకాష్‌రెడ్డి, మనోరంజన్, మెయింటెనెన్స్ యూనిట్ హనుమంతరెడ్డి, మోహన్, బ్లడ్ బ్యాంక్ కిషోర్, స్కూల్ పిల్లలు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ చేపట్టిన ఉద్యోగులు

కమ్యూనిటీ కోఆర్డినేటర్ సేవలు మరువలేనివి : డిఆర్‌డిఎ పీడీ

మడకశిర : కమ్యూనిటీ కోఆర్డినేటర్(సిసి)గా లక్ష్మీనారాయణ అందించిన సేవలు మరువలేనివని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎన్ నరసయ్య తెలిపారు. రొళ్లలో సిసిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీనారాయణను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పీడీ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మీనారాయణను పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిపిఎంలు రామిరెడ్డి, ఎసి ఎస్ఆర్.నాగరాజు, లక్ష్మీకాంత, నియోజకవర్గంలోని ఐదు మండలాల మహిళా సంఘాల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సిసి ఉద్యోగ విరమణ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసయ్య

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

ధర్మవరం టౌన్ : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచిగుర్తింపు లభిస్తుందని ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణరావు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ వి.సూర్యుడు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్‌తో పాటు ఉద్యోగులు, ఆత్మీయులు, బంధుమిత్రులు సూర్యుడుతో పాటు భార్య అరుణమ్మను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగార్జునరెడ్డి, ముస్తఫా, సుమో శీన, తిరుమలేష్ బాబు, నరసింహులు, హనుమాన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ సహజం

పుట్టపర్తి అర్బన్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని, వారు ప్రజలకు అందించిన సేవలు శాశ్వతంగా నిలుస్తాయని జిల్లా పౌర సంబంధాల అధికారి వేలాయుధం పేర్కొన్నారు. పట్టణంలోని డిపిఆర్ఒ కార్యాలయంలో పనిచేస్తున్న ఎవిఎస్ రాజేంద్రప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వేలాయుధం మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ తిరుపతి, తిరుమల, అనంతపురం, కడప జిల్లాల్లో పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్‌గా, విజువల్ సూపర్వైజర్‌గా పని చేసి పుట్టపర్తిలో ఉద్యోగ విరమణ చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సంబంధాల అధికారి రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ రవి ప్రకాష్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామన్న, టైపిస్టు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి దంపతులను సన్మానిస్తున్న డిపిఆర్ఒ వేలాయుధం

ఎస్ఐకి ఆత్మీయ సన్మానం

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ శాఖలో ఎస్ఐగా పని పని చేస్తున్న వెంకటేష్ ఉద్యోగ విరమణ పొందగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి వెంకటేశులు సేవలను కొనియాడారు. అనంతరం సిఐతో పాటు తోటి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఎస్ఐ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిఐ హేమంత్ కుమార్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎమ్‌కు ఘన వీడ్కోలు

తలుపుల : స్థానిక బలిజపేట ఎలిమెంటరీ స్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న మహమ్మద్‌పీరా శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ వెంకట రాముడు, ఉపాధ్యాయ బృందం, మిత్రులు శ్రేయోభిలాషులు హాజరై ఆయన సేవలను కొనియాడారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పీరా 1989లో వీరేపల్లిపేట స్కూల్‌లో స్పెషల్ టీచర్‌గా చేరారు. ఆ రోజు నుంచి ఎంతోమంది పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దారని పలువురు కొనియాడారు.

పెనుకొండ ఆసుపత్రిలో అన్నదానం

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం టిఎన్.వెంకటేష్ తన కుమార్తె టిఎన్.భవ్యసుధ జ్ఞాపకార్థం సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ శంకరప్ప మాట్లాడుతూ భవ్యసుధ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ తండ్రి వెంకటేష్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, రోగులు 130 మందికి అన్నదానం చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్.శ్రీనివాసులు, ప్రభావతి, రమాదేవి, నాగార్జున, కులసాయి, నితీష్, విక్రమ్‌సాయి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాయలసీమలో రైతులు ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేస్తారని, కావున ప్రభుత్వం నాణ్యమైన విత్తన కాయలు పంపిణీ చేయాలని ధర్మవరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మండలంలోని సంజీవపురం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రాయితీ విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీతో నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నా జగన్ ప్రభుత్వం నాసిరకం విత్తనాలు ఇస్తోందన్నారు. కేంద్రం ఇస్తున్న రాయితీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో రైతులు సకాలంలో వర్షాలు పడక ఓ వైపు నష్టపోతుంటే మరోవైపు ప్రభుత్వం నుంచి సరైన రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందక నష్టపోయారన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కోటి సూర్యప్రకాష్‌బాబు, అప్రాచెరువు వీరప్ప, సురేందర్‌నాయుడు, నెట్టెం రమణ ఉన్నారు.

దళితుల భూములు వారికే దక్కాలి

సోమందేపల్లి : దళితుల భూములు దళితులకే దక్కాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చాకర్లపల్లి సమీపంలోని 3.81 ఎకరాల భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డులపై ప్రజాశక్తిలో వచ్చిన కథనంతో దళిత సంఘాల నేతలు స్పందించారు. వారు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అంజనాదేవిని కలిసి సమస్యను వివరించారు. దళితుల భూములు దళితులకే చేయాలని లేనిచో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిం చారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తామ న్నారు. కార్యక్రమంలో వైసిపి దళిత సంఘం నాయకులు గజేంద్ర, బహుజన చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాగరాజు, బాధిత మహిళ గంగరత్న పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

గోరంట్ల : పట్టణంలోని శ్రీకృష్ణదేవ రాయలు జూనియర్ కళాశాలలో 2024-25కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి తెలుగు, ఇంగ్లీష్ మీడియం గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నా యన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ మూల్యాంకనం

కొత్తచెరువు రూరల్ : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడానికి ఇంటర్ బోర్డ్ కమిషనర్ శ్రీకారం చుట్టారని జిల్లా పరీక్షల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. యుఐడి నెంబర్ కలిగిన జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ అధ్యాపకులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

7న మండల మీట్

ముదిగుబ్బ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జూన్ 7వ తేదీ మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని జడ్పిటిసితో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపిడిఒ నాగశేషాచలరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువులో ప్రయివేట్ విద్యాసంస్థల ఆగడాల అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిఇఒ మీనాక్షికి వినతి పత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల పేరుతో లక్షలాది రూపాయలు, పాఠ్యపుస్తకాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, వాటి యాజమా న్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

'పది' సప్లిమెంటరీ ప్రశాంతం : డిఇఒ

కొత్తచెరువు రూరల్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. జిల్లాలో 29 కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన సోషియల్ పరీక్షకు 2,045 మందికి గానూ 945(46 శాతం) మంది హాజరు కాగా 1,100 మంది విద్యార్థులు గైర్హాజరయ్యా రు. అన్ని కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు డిఇఒ తెలిపారు.

విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం వద్ద నిరుపేదలు, ఇల్లు లేని వారు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ కాలనీకి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న ఆధ్వర్యంలో పేదలు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెద్దన్న మాట్లాడుతూ పది రోజుల క్రితం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులకు తమ సమస్యను వివరించినా ఫలితం లేదన్నారు. తక్షణమే విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు అంజనాదేవి, స్వర్ణలత, నంజుండప్ప, రామాంజనమ్మ, పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కదిరి టౌన్ : ప్రతిభా పురస్కారాలకు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, సెకండ్ ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన వాల్మీకి(బోయ) విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలో శుక్రవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 480, ప్రవేటు పాఠశాలల్లో 510, ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల్లో 800, ప్రయివేట్ కళాశాలల్లో 850 మార్కులు, ఆపైన సాధించిన విద్యార్థులు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రంతో జూన్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎం.సోమశేఖర్ 94412 75736, కె.రామాంజనేయులు 94919 82526, టి.నరసింహులు 9985 05307 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:326/2022
Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు, Rep by its Senior Manager, N.P.Kunta. ...Plaintiff
మరియు
D1:సయెద్ ఖాదర్ బాషా S/o సైదర్ సాబ్, Residing at పెదబల్లి గ్రామం, నంబులపూలకుంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
D2:షేక్ జకీయా S/o రహంతుల్లా, Residing at పెదబల్లి గ్రామం, నంబులపూలకుంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Defendants
పై దావాలోని D1 and D2 ప్రతివాదులకు దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు) ప్రతివాది D1 and D2 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 25/06/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 25/06/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:25/06/2024
స్థలం : కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్, వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:206/2022
Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు, Rep by its Senior Manager, N.P.Kunta. ...Plaintiff
మరియు
D1:గొందిపల్లి రమణ S/o పెద్దన్న,
D2:రేపన రమణ S/o Late వెంకటరమణ,
D3:రేపన ప్రసాద్ S/o Late వెంకటరమణ,
All are Residing at గూటిబైలు గ్రామం, నంబులపూలకుంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Defendants
పై దావాలోని D1,D2andD3 ప్రతివాదులకు దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు) ప్రతివాదులు D1, D2 and D3 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 09/07/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 09/07/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:9/07/2024
స్థలం : కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్, వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:903/2022
Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు, Rep by its Senior Manager, N.P.Kunta. ...Plaintiff
మరియు
D1:కొలాటి ఈశ్వర్ రెడ్డి S/o శివరెడ్డి, Residing at దిగువపల్లి గ్రామం,నంబులపూలకుంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Defendant
పై దావాలోని D1 ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి.కుంట బ్రాంచ్ వారు) ప్రతివాది D1 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 23/07/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 23/07/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను.లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:23/07/2024
స్థలం : కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్, వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:216/2014
Between:
టి.హేమంత్ కుమార్ మరియు ఇతరులు, ...Plaintiffs
మరియు
తుమ్మలూరు వెంకటరమణ @ టి.వి.రమణ మరియు ఇతరులు ...Defendants
D2:తుమ్మలూరు రమణమ్మ W/o తుమ్మలూరు వెంకటరమణ @ టి.వి.రమణ, R/at రామాలయం, Near రౌండ్ బిల్డింగ్ కదిరి టౌన్ మరియు మండలం.
పై దావాలోని 2వ ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలోని వాది టి.హేమంత్ కుమార్ మరియు ఇతరులు,2వ ప్రతివాదిగా మిమ్ములను పై దావాలో చేర్చి ఉన్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 24/06/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 24/06/2024 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను.లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:24/06/2024
స్థలం : కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్, వాదితరుపు వకీలు, కదిరి